# కోదండంగారి కల

"వాణ్ణొదిలి పెట్టను. అమ్మికొడుకు, భూమ్మీద ఎక్కడున్నా సరే గాలించి పట్టుకోకపోతే నా పేరు కోదండమే కాదు" అన్నాడు పి.డి. కోదండంగారు.

టీ.సీ. లిద్దరికీ నవ్వు వచ్చింది. కాని పైకి నవ్వలేదు.

సురేశన్ మాత్రం- "ఎక్కడెక్కడో వెదికి లాభంలేదు. వాడు మీకు స్టేషనులోనే దొరకాలి ఎప్పటికయినా. అయినా అసలు విషయం చెప్పండి. మాస్టారూ! వాడితో ఏమిటి పని మీకు? వాళ్ళు దొంగతనాలు చెయ్యరు. అల్లరీ ఆగమూ కూడా చెయ్యరు. అసలేం జరిగింది ?" అని అడిగాడు.

"చెబుతాను....చెబుతాను....మళ్ళీ వచ్చి చెబుతాను" అంటూ కోదండంగారు గబగబ మెట్లెక్కి అవతలి ప్లాట్‌ఫారం మీదికి వెళ్ళిపోయాడు.

"ఏమిటయ్యా గొడవ?" అని అడిగాడు అవతలి టీ.సీ.

"ఏమీలేదు. ఈయన తెలుసుగా నీకు ? రైల్వే స్కూల్లో పీ.డీ. అంటే వ్యాయామోపాధ్యాయు డన్నమాట. నేనక్కడే టెన్తువరకూ చదివాను కదా? అన్ని క్లాసుల పిల్లలకూ ఈయన అంటే హడల్....లెక్కలు, ఇంగ్లీషు, సైన్సు వగైరా టీచర్లకంటె పేరు ఎక్కువ. మనిషి మహా కఠినుడు. స్కూలు ఎగ్గొట్టినా ఫరవా లేదు కాని ఫిజికల్ ఎడ్యుకేషన్ క్లాసుకు రానివాడు మాత్రం మర్నాడు చచ్చాడన్నమాటే."

"అయితే ఇప్పుడు సెలవుల్లో ఈయన స్టేషనంతా అన్ని ప్లాట్‌ఫారాలూ గాలించడం ఎవరికోసం ?"

"అదే చెప్పబోతున్నాను. ఒక చిన్న గుంపు ఉంది స్టేషన్‌లో. వాళ్ళు నలుగురు....అనాథలు....చీపుళ్ళు పట్టుకుని రైళ్ళలో ఎక్కి పెట్టెలు ఊడ్చి శుభ్రం చేసి ప్రయాణీకులు పడేసిన చిల్లర డబ్బులతో బతుకుతుంటారు. వాళ్ళకి స్టేషనే యావత్ప్రపంచమూను. వాళ్ళు మన రైల్వే ఉద్యోగులందరికీ బాగా తెలుసు. ముగ్గురు మగ వెధవలు....ఒక ఆడపిల్లా.... ఈయనకు కావలసిన వాడి పేరు నిప్పుకోడి. వాడి కాపేరు ఎలా వచ్చిందో ఎవరికీ తెలీదు. ఈయన చేసిన వర్ణనను బట్టి వాణ్ణి పోల్చుకున్నాను. వాళ్ళు నాలుగు రోజులుగా అయిపులేరు. ఏ ఫాస్టు రైల్లో ఎటుపోయారో తెలీదు."

"ఈయన కేమిటి వాడితో పని?"

"చెబుతా నన్నానుగా....రానివ్వు...."

ఏదో రైలు వచ్చింది కాబోలు జనం రావడంతో టీ. సి. లకు ఇద్దరికీ పని తగిలింది.

పది నిముషాలలో ఆ హడావిడి తగ్గిన తర్వాత కోదండంగారు అక్కడే నిలబడి ఉండటం చూశారు.

కోదండంగారు తల అడ్డంగా ఊపుతూ "అన్ని ప్లాట్‌ఫారాలూ, మూల మూలలా గాలించాను. ఎక్కడా వాడి జాడ లేదు" అన్నాడు.

టీ. సి. లిద్దరూ తీరిగ్గా కూర్చుని టీ తెప్పించి కోదండం గారికి కూడా ఇచ్చి, సిగరెట్లు ముట్టించి ఆయన చెప్పే విషయం వినడానికి సన్నద్ధులైనారు. భారతదేశం మొత్తంలో అతి పెద్ద స్టేషన్లో ఒకటి ...ఎల్లప్పుడూ రద్దీగా ఉంటుంది. అది పగలే అయినా నిరంతరం లైట్లతో పట్టపగలు లాగా ఉంటుంది.

కోదండంగారు కొద్ది క్షణాలు నిశ్శబ్దంగా కూర్చుని ఆ తర్వాత శ్రోత లిద్దరి ఉత్కంఠను గమనించి చెప్పడం ప్రారంభించాడు 'అసలేం జరిగిందంటే........' అని.

అసలేం జరిగిందంటే....

వారంరోజుల క్రిందట కోదండంగారు సెలవులు కావడంవల్ల ఏమీతోచనివాడై ప్లాట్‌ఫారం చివర పచార్లు చేసి చేసి చివరకు ఒక సిమెంటు బల్లమీద కూర్చుని తీరిగ్గా పేపరు చదవటం ప్రారంభించాడు. అయితే కాస్సేపటిలోనే ఆయన ప్రశాంతతకు భంగం కలిగింది. పేపరు మడిచి పక్కనపడేసిచూస్తే ప్లాట్‌ఫారం చివర ఒక చిన్న సైజు గందరగోళం .... ఏడెనిమిది మందో, పదిమందో చేరి వున్నారు. అందరూ మాసినబట్టలతో,చింపిరితలలతో, చేతులలో చీపుళ్ళతో ఘోరంగావున్నారు.

వారిలో ఒక ఆరేడేళ్ళ పిల్ల కూడా వుంది. అందరూ గుంపుగా చేరారు. కాసేపు అరుపులూ, కేకలు చెలరేగాయి. అంతలో ఇద్దరు వెధవలు బాహాబాహీ కచాకచీ ముష్టాముష్టి యుద్ధం ప్రారంభించారు. తర్వాత ఒకడు ముందుకు దూకి వాళ్ళను విడదీశాడు. కోదండంగారికి ఒక విషయం అర్థమైంది.

వాళ్ళు మొత్తం రెండు గ్రూపులు. ఒక గ్రూపువాళ్ళు నలుగురు చిరకాలంగా, అంటే పుట్టిబుద్ధెరిగినది మొదలు, ఈ మహా రైల్వే స్టేషనే ప్రపంచంగా బతుకుతున్నారు. ఫాస్టు రైళ్ళలో ఎక్కి వందలాది మైళ్ళు మద్రాసు, హైదరాబాదు, విశాఖ, బొకారో ఒకటేమిటి అన్నిచోట్లకు వెళ్ళి రైలు పెట్టెలు ఊడ్చి బతుకుతున్నారు. వాళ్ళంటే రైల్వే ఉద్యోగులకూ, స్థానిక పోలీసులకూ కూడా అయిష్టం ఏమీ లేదు. పైగా జీతం బత్తెం లేకుండా పారిశుధ్య కార్యక్రమం అమలు జరిపేందుకు జీవితాలను అంకితం చేశారని కొంచెం సానుభూతి కూడా వుంది. పైగా వాళ్ళు దొంగతనాల వంటివి చేయరు. ఇది ఇలా ఉండగా ఇటీవల మరో కొత్త గుంపు-వాళ్ళు అయిదుగురు మగ వెధవలు - ఇక్కడికి దిగింది. అందరి బతుకు తెరువూ ఒకటే అయినా రెండు గ్రూపుల మధ్య వైరం తప్పలేదు. అది ఈనాటికి తిట్లు, శాపనార్థాల స్థాయి దాటి ప్రత్యక్షయుద్ధంగా మారింది.

కొట్టుకుంటున్న ఇద్దరినీ విడదీసిన వాడు - వాడి పేరు నిప్పుకోడి — ఒక ప్రతిపాదన చేశాడు. అదేమిటంటే ఈ వైరం శాశ్వతంగా అంతం కావాలి. రెండు కత్తులు ఒక ఒరలో ఇమడవు. తమ రెండు గ్రూపులు ఒకే స్టేషనులో బతకడం కుదరదు. కాబట్టి ఒక్కొక్క గ్రూపులో నుంచి ఒక్కొక్కణ్ని ఎన్నిక చేసుకోవాలి. వాళ్ళిద్దరూ ద్వంద్వ యుద్ధం చేయాలి. ఓడినవాడి గ్రూపు వాళ్ళు ఈ స్టేషను వదిలిపెట్టి మరో చోటికి వెళ్ళిపోవాలి. ఈ ప్రతిపాదన అందరికీ నచ్చింది. ఇటు నుంచి నిప్పుకోడిగాడు, ఎదుటి గ్రూపులో నుంచి మరొకడూ ద్వంద్వ యుద్ధానికి సిద్ధమైనారు. మిగిలిన వాళ్ళు దూరంగా చుట్టూ వలయంగా నిలబడ్డారు. ఇద్దరు జోదులు కలియబడబోతుండగా అనుకోని ప్రమాదం ముంచుకొచ్చింది. ఈ వ్యవహారం అంతా కోదండంగారు మాత్రమే కాక, అవతల నిలబడిన రైల్వే పోలీసు కూడా అంతా ఆసక్తితోనూ గమనిస్తున్నాడింతసేపూ. అతను ఇంక ఊరుకోలేకపోయాడు. పెద్దగా గర్జించి కర్ర తిప్పుతూ "గాడిద కొడుకుల్లారా" అంటూ ముందుకు దూకాడు. దాంతో ఎక్కడి వెధవ లక్కడ ఎటుపడితే అటు కకావికలై పారిపోయారు.

పోలీసు దృఢకాయుడు. ఆ ఇద్దరు పిల్లవీరులను మెడల దగ్గర పట్టుకున్నాడు. ఉడుము పట్టు పట్టాడు. "పదండి....కుక్కల కొడుకుల్లారా .... మీ అంతు చూస్తా నివ్వాళ" అని వాళ్ళిద్దరినీ బస్తాల్లాగా బరబర ఈడ్చుకుపోతున్నాడు. కోదండంగారు అసంకల్పితంగానే లేచి పేపరు చేత పట్టుకుని అతన్ని అనుసరించాడు. అప్పుడు జరిగింది అసలు వింత....ప్లాట్‌ఫారం చివర ఎక్కడో పోలీసు కంట్రోలు రూము. అక్కడికి మరో యాభై గజాలు నడవవలసి ఉండగా నిప్పుకోడిగాడు ఆగి "సార్ ....సార్" అన్నాడు చిటికెన వ్రేలు చూపిస్తూ.

"వెళ్ళిరా వెధవా" అని పోలీసు వాడి మెడను వొదిలి పెట్టాడు. నిప్పుకోడి గాడు మూత్రశాల లోపలికి వెళ్ళాడు. కోదండంగారు చూస్తూనే వున్నాడు. నిప్పు కోడిగాడు అవతలివైపు నుంచి బయటికి వచ్చి అక్కడ ఫెన్సింగ్ పక్కనే వున్న ఏదో పాత ఇనపగొట్టం, పొడవాటిది తీసుకుని అయిదారు అడుగులు వెనక్కువచ్చి ఒక ఊపున ముందుకు పరుగెత్తి ఆ గొట్టం ఆధారంగా గాలిలోకి లేచి ఏడడుగులు పైన వున్న ఆ ఫెన్సింగ్‌ను అవలీలగా లంఘించి అవతలవైపు దూకి పారి పోయాడు

పోలీసు కళ్ళు పెద్దవైనాయి. కోపంతో పళ్ళు పటపట కొరికాడు. ఆ తర్వాత మొత్తం కోపం అంతా తన చేతిలో ఉన్న వాడి మీద చూపిస్తూ వాణ్ణి చేతి కర్రతో బాదుకుంటూ ముందుకు తోసుకుపోయాడు. కోదండంగారు ఆశ్చర్యంతో తలమున్కలైనాడు. ఇలాటి దెప్పుడూ చూడలేదాయన. తర్వాత అక్కడికి వెళ్ళి ఆ ఫెన్సింగ్ ఎత్తు, ఆ ఇనపగొట్టం పొడవు పరిశీలించాడు. ఫెన్సింగ్ అవతల ఏమున్నదీ చూశాడు. మొత్తం పరిశీలన అయిన తర్వాత "అమ్మో! వేలెడు లేడు వెధవ .... ఎంత గొప్ప ఫీట్ చేశాడు! వీణ్ని వొదలకూడదు. పట్టుకోవాలి" అనుకున్నాడు. అప్పటి నుంచి వాడికోసం రోజూ స్టేషనంతా గాలిస్తున్నాడు.

జరిగింది విన్న టీ సీ లిద్దరూ ఆశ్చర్యపోయారు.

సురేశన్ "అది సరే....వాడు దొరికితే ఏం చేద్దామని?"

కోదండంగారు లేచారు.

"ఏం చేస్తానా? ముందు వాడు దొరకనివ్వండి. మీ కంటబడినా సరే కదల నివ్వకండి. నాకు అప్పగించండి. తీసుకువెళ్ళి నా దగ్గరే ఉంచుకుని అంతగా అయితే పెంచుకుని వాణ్ణి ఒలింపిక్స్ లెవలుకు తీసుకుపోతాను. సర్జీ బుబ్కా అంతవాడిగా

తయారు చేస్తాను. ప్రపంచంలోనే పోలీస్ వాళ్ళు నెంబర్ వన్‌గా తీర్చిదిద్దుతాను" అని ఆవేశంతో ఈ మాటలని కోదండంగారు విసురుగా నడుచుకుంటూ వెళ్ళిపోయాడు.

* * *

సరిగ్గా పదిరోజుల తర్వాత ....

సురేశన్ డ్యూటీ దిగి తన వ్యూహాలు కార్యక్రమాలు ముగించుకుని అలసటతో టై వొదులు చేసుకుంటూ వస్తుండగా ప్లాట్‌ఫారం మీద ఒక పక్కగా కనిపించింది మంచి దృశ్యం.

లైట్లు అప్పుడే వెలుగుతున్నాయి. అక్కడ మాత్రం కొంచెం క్రీనీడ .... గోడవారగా పిల్లలు ...కాళ్ళు బారజాపుకుని గోడకానుకుని కూర్చున్న వాడొకడు.... వాడి ముందు చేతులలో బీసుళ్ళతో ముగ్గురు....ఒకతె ఆడపిల్ల.

సురేశన్ వాళ్ళను....ముఖ్యంగా నిప్పుకోడిని గుర్తుపట్టాడు. దూరంగా నిలబడి సిగరెట్ ముట్టించుకున్నాడు. అలసట తగ్గినట్టనిపించింది. కొన్ని క్షణాలు నిశ్శబ్దంగానే నిలబడ్డాడు.

తర్వాత బూట్లు చప్పుడు కాకుండా నడిచి వెళ్ళి "ఒరే! నిప్పుకోడివి నువ్వే కదూ?" అని అడిగాడు.

వాళ్ళు పిడుగుపడినట్టు హడిలిపోయారు. టీ సీ ని గుర్తు పట్టారు. అయితే పారిపోయే ప్రయత్నం మాత్రం చేయలేదు.

నిప్పుకోడి మాత్రం భయంతో "సార్....సార్....నన్నొదిలి పెట్టండి సార్! యస్సయ్ గారికి పట్టివ్వకండి సార్....నేను పారిపోయింది నిజమే సార్....అసలు పారిపోయేవాణ్ని కాదు సార్....కొడతారని భయపడి పారిపోయాను సార్....కనికరించండి సార్...." అంటున్నాడు.

మిగిలినవాళ్ళు కూడా 'సార్....సార్' అని గోలపెడుతున్నారు.

సురేశన్ "నోళ్ళు ముయ్యండిరా. ఊరికే ఎందుకు కాకుల్లాగా అరుస్తారు? నేను మిమ్మల్ని పట్టివ్వను" అనడంతో నలుగురూ కొంచెం శాంతించారు.

నిప్పుకోడిగాడు కుదుటబడ్డట్టు కనిపించాడు.

సురేశన్ వాడివంక కళ్ళార్పకుండా చూశాడు. వాడు ఎక్కడ ఎవరికి పుట్టాడో, ఈ పెద్ద స్టేషనులోకి ఎలా వచ్చిపడ్డాడో-వాడికే కాదు ఎవరికీ తెలియదు. ఆ మాటకొస్తే మిగిలిన ముగ్గురికీ కూడా తమ లాంటి పుట్టుపూర్వోత్తరాలేవీ తెలియవు. వాళ్ళ తలలు మాసి వున్నాయి. దుమ్ముకొట్టుకొని అట్టలు కట్టి వున్నాయి. బట్టలు చిరిగి పీలికలై కేవలం మాన సంరక్షణం మాత్రమే చేస్తున్నాయి. వాళ్ళ

అప్పటి వరకూ తమ ప్రత్యర్థి గ్రూపు శాశ్వతంగా ఈ స్టేషను వొదిలిపెట్టి పోయిం దన్న ఆనందంతో ఉన్నారు. సురేశన్ రాకతో ఆ ఆనందం చల్లబడిపోయింది. వాళ్ళ ముఖాలు దీనంగా ఉన్నాయి.

సురేశన్ నెమ్మదిగా ప్రారంభించాడు.

"నేనేమీ చెయ్యను. మీరు కంగారుపడొద్దు. పోలీసులను మీ జోలికి రాని వ్వను. ఇప్పుడేకాదు ముందు ముందు కూడా మీ జోలికి రావద్దని పోలీసులకు చెబు తాను. కాని ఈ నిప్పుకోడిగాణ్ణి మాత్రం కాస్సేపు నాకు అప్పగించాలి. కాస్సేపే. తర్వాత వాడు హాయిగా వచ్చేస్తాడు."

"యస్సయ్ గారి దగ్గిరికాసార్" అన్నది ఆడపిల్ల బితుకు బితుకుమంటూ.

"కాదు....కాదన్నాను కదా. నన్ను నమ్మరేం?" అని చిరాకు పడ్డాడు సురే శన్.

నిప్పుకోడిగాడు "సరే సార్. పదండి" అన్నాడు తెగించినవాడిలా. కొద్ది క్షణాలు మిగిలిన ముగ్గురితో లోగొంతుకతో మాట్లాడాడు. బహూశా వాళ్ళెక్కడ వుండవలసిందీ, ఏం చేయవలసిందీ వగైరా వివరాలేమో.

వాళ్ళు బిక్క మొహాలు వేసుకుని విన్నారు.

వాడు సురేశన్ వెంట నడిచాడు. సురేశన్ "మీ వాణ్ణి గంటలో నేనే తీసు కొచ్చి మీకు అప్పజెబుతాను" అని ఆ ముగ్గురికి హామీ ఇచ్చి ముందుకు నడిచాడు. వాళ్లు ముగ్గురూ దూర దూరంగా అనుసరిస్తూనే ఉన్నారు.

సురేశన్ గేటు దగ్గర ఆగి "ఏరా! ఏమయినా తింటావా? ఆకలిగా లేదూ?" అని అడిగాడు.

వాడు తల అడ్డంగా ఊపి "లేదు సార్" అన్నాడు.

ఇద్దరూ స్టేషను ఇవతలికి వచ్చారు. రోడ్లుమీద నీడలు పరుచుకొనివున్నాయి. కుడిప్రక్కన పెద్ద పెద్ద భవంతులు, రైల్వే ఆఫీసులు, ఆ పక్కన రిటైరింగ్ రూములు, ఆ పైన పెద్ద ఆవరణలో రైల్వేస్కూలు, ఎదురుగా విశాలమైన ఆట స్థలం. పోను పోను వెలుతురు మందగించింది. అక్కడ నాలుగు అయిదు అంత స్తుల క్వార్టర్సు, కిటికీలలో నుంచి ప్రసరిస్తున్న వెలుతురు, ఒక్కొక్క కట్టడం ఒక్కొక్క పెద్ద దీపాల ఓడ లాగున్నది.

సురేశన్ నడుస్తూనే "ఏరా? సువ్వారోజు పోలీస్ చేతిలో నుంచి ఎలా తప్పిం చుకున్నావురా?" అని అడిగాడు.

వాడు జవాబు చెప్పడానికి తటపటాయిస్తూ ఉంటే తానే అంతా చెప్పి 'అంతేనా' అని అడిగాడు.

వాడు "అంతే సార్" అన్నాడు వినయంగా.

"నువ్వు చేసిన ఫీట్ మన రైల్వేస్కూల్ మాష్టారు చూశారు. ఆయన ఆటల మాష్టారులే. నిన్ను గొప్పవాణ్ని చేస్తారట. తర్ఫీదు ఇస్తారట."

నిప్పుకోడిగాడు నిశ్శబ్దంగా విన్నాడు.

కోదండం గారి పోర్షన్ ముందుకు రానే వచ్చారు. అక్కడ అయిదారుగురు చేరి ఉన్నారు. వాళ్ళలో వాళ్ళు మాట్లాడుకుంటున్నారు. అంతా ప్రయాణ వాతావరణంలా ఉంది.

సురేశన్ అనుమానిస్తూ వెళ్ళి "ఏమిటి? ఏం జరిగింది?" అని అడిగాడు.

ముందుగదిలో అడుగుపెట్టిన సురేశన్‌కు కోదండంగారి అబ్బాయి—ఎక్కడో రాంచీలో రైల్వే శాఖలో పనిచేస్తున్నవాడు — ఎదురయ్యాడు. ఇద్దరూ కలిసి చదువుకున్నవాళ్ళు కావడంచేత సురేశన్ అతన్ని "ఏమిటి? ఏం జరిగింది?" అని మళ్ళీ కంగారుగా అడిగాడు.

నిప్పుకోడిగాడు గుమ్మం అవతల నిలబడి కిటికీలో నుంచి లోపలికి తొంగి చూస్తున్నాడు.

"ఏమీ లేదు. చిన్న ట్రబుల్. నేను టెలిగ్రాం అందుకుని వచ్చాను నిన్ననే. మా ఫాదర్‌కు బి. పి. బాగా వుందిగా. మొన్న నెప్పుడో పడిపోయాట్ట. అదీ రోడ్డు పక్కన. అంతా కంగారు పడిపోయారు. అమ్మ అయితే గజగజలాడిపోయింది. డాక్టర్లు 'ఇప్పటికి ఫరవాలేదు. కాని ముందు ముందు ప్రమాదం. పక్షవాతంలోకి దిగవచ్చు, హార్టు ట్రబుల్ కూడా రావచ్చు' అని కాషన్ ఇచ్చారు. ఇంక కొద్దికాలమే సర్వీసు ఉంది. నేను వెంట తీసుకుపోతున్నాను. అమ్మను కూడా తీసుకుపోతున్నాను అక్కడ ట్రీట్‌మెంట్ ఇప్పిస్తాను. ఇప్పుడే మరో గంటలో రైలు"

సురేశన్ "ఇప్పుడు పరిస్థితి ఏమిటి?" అని అడిగాడు.

"అట్లా పడుకుని ఉన్నాడు. మాట సరిగా రావడంలేదు."

అతను సురేశన్‌ను లోపలికి తీసుకుపోయాడు.

కోదండంగారు పడుకుని ఉన్నారు. ముఖం కొంచెం మారింది. నోరు కొద్దిగా పక్కకు తోసుకుపోయినట్టు అనిపిస్తున్నది. గడ్డం పెరిగి వుంది.

ఆయన సురేశన్‌ను చూసి నవ్వేందుకు ప్రయత్నించి లేవబోయి విఫలుడై నెమ్మదిగా "వాడు.... వాడు.... దొరికాడా?" అన్నాడు.

"ఆఁ! దొరికాడు!" అంటూ సురేశన్ బయటకువెళ్ళి నిప్పుకోడిని వెంటబెట్టుకుని ఆయన మంచం దగ్గరికి తెచ్చాడు. అక్కడ చేరిన వారు ఆశ్చర్యంతో చూస్తూ వుండగా కోదండం గారు నిప్పుకోడిగాడి మురికి చేతిని ఆప్యాయంగా పట్టుకున్నాడు. కళ్ళు చెమ్మగిల్లాయి కూడా. కాస్సేపు నిర్నిమేషంగా వాణ్నే చూస్తూ ఉండిపోయాడు. ఆ తర్వాత కొడుకును పిలిచి అతని చెవిలో నెమ్మదిగా ఏదో చెప్పాడు. అతడు వింతగాచూస్తూ తల వూపి లోపలికి వెళ్ళి ఒక వంద రూపాయల నోటుతెచ్చి తండ్రికి అందించాడు.

ఆయన దాన్ని అందుకుని నిప్పుకోడిగాడి చేతిలో ఉంచి గుప్పెట మూసి చెయ్యి నిమిరాడు. తర్వాత కళ్ళు మూసుకున్నాడు.

ఒక నిముషం తర్వాత సురేశన్ లేచి వారి దగ్గర సెలవు తీసుకుని కిందికి వచ్చాడు. రోడ్డు మీదికి రాగానే "పోరా! ఇక మీ వాళ్ళ దగ్గరికి పో. పరుగెత్తు" అన్నాడు.

నిప్పుకోడిగాడు సురేశన్‌కు నమస్కరించి వెనుదిరిగి పరుగు లంకించుకున్నాడు.

అక్కడ....

బుజ్జమ్మ దిగులుగా కూర్చుని ఉంది. చింపిరిగాడు, కోటిగాడు పచార్లు చేస్తున్నారు.

అంతలో బుజ్జమ్మ 'అదిగో....వచ్చేస్తున్నాడు' అని కేకలు పెట్టింది. ముగ్గురూ హడావిడిగా వాడికి ఎదురు పరుగెత్తారు. మరు నిముషంలో నలుగురూ గోడ వార మూలకు చేరి గుసగుసలు మొదలుపెట్టారు. నిప్పుకోడిగాడు వెనక జేబులో నుంచి వంద కాయితం తీసి మడతలు విప్పి వాళ్ళ ముందు పరిచాడు.

ముగ్గురి కళ్ళూ పెద్దవైనాయి. 'అవు న్నిజమే. వంద రూపాయలు' అని అరిచింది బుజ్జమ్మ.

ఆ తర్వాత నలుగురూ చతికిలబడి చాలాసేపు మాట్లాడుకున్నారు. ఏవేవో కబుర్లు చెప్పుకున్నారు. బన్ను ముక్కలు తిని టీ తాగారు. ఇక గోడ పక్కనే వరసగా చీపుళ్ళు పక్కన పెట్టుకుని పడుకున్నారు. క్రమంగా వెలుతురు మసకగించింది. జనం రద్దీకూడా బాగా తగ్గిపోయి ప్రశాంతత అలుముకుంది. ఎప్పుడయినా ఏదో

రైలు వస్తే కొంచెం అలజడి....నలుగురూ నిద్రపోతున్నారు. నలుగురికీ కలలో వంద రూపాయల నోటు సినిమా పోస్టరంత పెద్దదై కనబడుతున్నది.

నిశ్శబ్ద నిశీథిలో మెత్తగా దూసుకుపోతున్న రైలుబండిలో....ప్రశాంతంగా పడుకుని నిద్రపోతున్న కోదండం గారికి కూడా కల వచ్చింది.

అందులో....

పెద్ద స్టేడియం, వేలాది మంది ప్రేక్షకులు ఉత్కంఠతో కూర్చుని ఉన్నారు. ఎన్నడూ ఎవరూ ప్రయత్నించని ఎత్తు....పోల్‌వాల్టు సందర్భం. పొడవాటి ప్లాస్టిక్ గొట్టం పుచ్చుకుని.... అదుగో....చిరిగిన బట్టలు, చింపిరి తల, నిప్పుకోడి వేగంగా పరుగెత్తుకు వచ్చి గాలిలోకి ఎగిరాడు. అంతెత్తు విజయవంతంగా దూకి అవతలి పరుపుల మీద పడ్డాడు.

వాడు నిప్పుకోడిగాడే....

కాదు....కాదు....

అంతలోనే ముఖం మారిపోయింది. అతడు బుచ్చాయే....ప్రేక్షకుల రణ గొణ ధ్వని అంతలోనే తగ్గింది.

రైలు వేగంగా పరుగెత్తుతూనే ఉంది. *